క్లుప్తంగా

నేడు మండల మీట్

సత్యవేడు: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటలకు సర్వసభ్య సమావేశం నిర్వహిస్తామని ఎంపీడీఓ రమణకుమార్ తెలిపారు. ఎంపీపీ వి.ప్రతిమ అధ్యక్షతన జరిగే సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పాల్గొంటారని చెప్పారు. మండల అధికారులు తగు సమాచారంతో రావాలన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు హాజరుకావాలని కోరారు.

అకాల వర్షంతో ట్రాన్స్‌కోకు రూ.3 లక్షల నష్టం


విద్యుత్ పునరుద్ధరణ పనులు చేస్తున్న ట్రాన్స్‌కో సిబ్బంది

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో శనివారం రాత్రి కురిసిన అకాల వర్షం, ఈదురు గాలులతో 28 విద్యుత్ స్తంభాలు నేలకూలాయని ట్రాన్స్‌కో ఏఈ పుణ్యకోటి తెలిపారు. ఫలితంగా రూ. 3 లక్షలు నష్టం వాటిల్లిందని చెప్పారు. గాలికి స్తంభాలు విరిగిపోవడంతో పలు గ్రామాల్లో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడిందన్నారు. ఈఈ వాసురెడ్డి, డిప్యూటీ ఈఈ సతీష్‌బాబు సహకారంతో యుద్ధ ప్రాతిపదికన పనులు చేస్తూ విద్యుత్‌ను పునరుద్ధరిస్తున్నామని తెలిపారు.

నేడు సత్యవేడులో గడప గడపకు..

సత్యవేడు: మండల కేంద్రంలోని నేతాజీ రోడ్డు, గంగమిట్ట ప్రాంతాల్లో సోమవారం మధ్యాహ్నం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కె. సుశీల్ కుమార్ రెడ్డి తెలిపారు. సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం గడప గడపకు వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుంటారన్నారు. అధికారులు, పార్టీ నాయకులు విజయవంతం చేయాలని కోరారు.

ఎండీపుత్తూరులో కంటి వైద్య శిబిరం

ఏర్పేడు: మండలంలోని ఎండీపుత్తూరులో సర్పంచ్ మోహనప్రియ, తిరుపతి వెన్నెల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. 25 మందిని ఆపరేషన్‌కు ఎంపిక చేశారు. వారికి మంగళవారం ఆపరేషన్‌లు చేయనున్నట్లు డాక్టర్ ప్రసన్నకుమార్‌రెడ్డి తెలిపారు.

టెన్త్ ఫలితాల్లో విక్రమ్ విద్యార్థుల ప్రతిభ

రేణిగుంట: శ్రీకాళహస్తి విక్రమ్ సక్సెస్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థులు 10వ తరగతి పరీక్ష ఫలితాల్లో సత్తా చాటారని స్కూల్ డైరెక్టర్ జి.చంద్రశేఖర్, కరెస్పాండెంట్ కె.మునిలక్ష్మి తెలిపారు. తమ స్కూల్ విద్యార్థులు గుణవర్ధన్, తేజ, లోకేష్‌యాదవ్ మంచి మార్కులు సాధించారన్నారు.

ఘనంగా మేడే సాంస్కృతికోత్సవాలు


నృత్య ప్రదర్శన చేస్తున్న చిన్నారులు

తిరుపతి కల్చరల్: మేడే వారోత్సవాల్లో భాగంగా యశోదానగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో ఆదివారం మేడే సాంస్కృతికోత్సవాలు ఘనంగా నిర్వహించారు. రీచ్ గ్లోబల్ ఫౌండేషన్ చైర్మన్ రమేష్‌నాథ్ లింగుట్ల, స్విమ్స్ వైద్యుడు మునస్వామి, తిరుపతి బాలోత్సవం గౌరవాధ్యక్షుడు టింకాయల దామోదరం, టీటీడీ డెప్యూటీ ఈవో ఎ.ఆనందరాజు, ఎల్ఐసీ ఉద్యోగుల యూనియన్ నేత వై.కృష్ణకుమార్, వేమన విజ్ఞాన కేంద్రం కార్యదర్శి ఎం.నాగార్జున ఉత్సవాలను ప్రారంభించారు. ఎస్వీ సంగీత, నృత్య కళాశాల, వివిధ పాఠశాలలకు చెందిన చిన్నారులు ఆలపించిన గీతాలు, నాట్య ప్రదర్శన, గ్రామిక గీతాలాపన, ప్రజానాట్య మండలి సభ్యులు గానం చేసిన విప్లవ గేయాలు ఆకట్టుకున్నాయి. ఉత్సవాల్లో పాల్గొన్న చిన్నారులకు సర్టిఫికెట్లు, జ్ఞాపికలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ఓవీ.రమణ, కడివేటి మునిరత్నం, ఆమూరి సుబ్రమణ్యం, రెడ్డెప్ప, అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారుల యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు కె.సుబ్రమణ్యం, ఎం.గంగులప్ప, సీఐటీయూ నేతలు నాగవెంకటేష్, వేణు, బుజ్జి, సుబ్రమణ్యం, డీవైఎఫ్ఐ నేత జయచంద్ర, ప్రజానాట్య మండలి సభ్యులు సెల్వరాజ్, వేణు పాల్గొన్నారు.

జగనన్నతోనే బీసీల అభ్యున్నతి

- ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే బియ్యపు మధు, ఎమ్మెల్సీ సిపాయి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి


ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం

ఏర్పేడు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే బీసీల అభ్యున్నతి సాధ్యమని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని పాతవీరాపురంలో ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేదలు లక్షాధికారులు కావాలన్నదే జగనన్న ధ్యేయమని చెప్పారు. టీడీపీ ప్రభుత్వంలో కొన్ని వర్గాలకే పదవులు వచ్చేవని ఎద్దేవా చేశారు. జగనన్న ఆశీర్వాదంతో నిజాయితీ పరుడైన డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం ఎమ్మెల్సీ అయ్యారని తెలిపారు. టీడీపీలో పదేళ్లుగా కష్టపడినా ఆయనను పట్టించుకోలేదన్నారు. పూతలపట్టు–నాయుడుపేట రోడ్డు నుంచి పాతవీరాపురం వరకు ఆర్‌అండ్‌బీ రోడ్డు పక్కన విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి విద్యుత్ దీపాలు వేస్తామన్నారు. నాడు–నేడు, అమ్మ ఒడి, వసతిదీవెన లాంటి పథకాలతో పేదలు అభివృద్ధి చెందుతారన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఇంతమంది టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరడం చాలా హర్షనీయమన్నారు. కరోనా సమయంలో రూ.5 కోట్లు సొంత సొమ్ముతో సేవా కార్యక్రమాలు చేసినట్లు వివరించారు. పేదలు మరణిస్తే రూ.10 వేలు, ముస్లింల వివాహాలకు బీరువా, బెడ్ తదితర సామగ్రి ఉచితంగా అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం మాట్లాడుతూ.. బడుగు, బలహీనవర్గాలపై సీఎం జగన్‌కు మమకారం ఎక్కువ అన్నారు. మళ్లీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డిని ఎమ్మెల్యేగా ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు తిరుమలయ్య, ఎంపీపీ గీత, వైస్ ఎంపీపీ జనార్ధన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు గురవారెడ్డి, ఉపాధ్యక్షుడు రాజారెడ్డి, కో–ఆప్షన్ సభ్యుడు బత్తిశెట్టి, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు శివయ్య, సింగిల్ విండో అధ్యక్షుడు జనార్ధన్, మాజీ ఎంపీటీసీ రమణయ్య యాదవ్, నాయకులు రామిరెడ్డి, మునిరత్నంరెడ్డి, మోహన్‌రెడ్డి, కోదండరామిరెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, హరిదాసు. జమున, భూలక్ష్మి, మునిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో పోలేరమ్మ, అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పోలేరమ్మకు పొంగళ్లు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని గాజులపెళ్లూరు పోలేరమ్మకు గ్రామస్తులు ఆదివారం పొంగళ్లు పెట్టారు. ఈ సందర్భంగా అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పొంగళ్లు సమర్పించి మొక్కులు చెల్లించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

నారాయణవనం: మండల కేంద్రమైన నారాయణవనంలో సోమవారం సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పర్యటిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సొరకాయలు తెలిపారు. సోమవారం ఉదయం నారాయణవనం హిందూ శ్మశాన వాటికలో పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ప్రారంభిస్తారని అన్నారు. పార్టీ శ్రేణులు, అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

డైకిన్ కంపెనీలో 10 మందికి ఉద్యోగాలు


ఉద్యోగాలకు ఎంపికైన పాలిటెక్నిక్ విద్యార్థులు

సత్యవేడు: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శ్రీసిటీలోని డైకిన్ కంపెనీ ప్రతినిధులు ఆదివారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. మొత్తం 30 మంది విద్యార్థులు హాజరుకాగా 10 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని కళాశాల శిక్షణ, ఉపాధి అధికారి ప్రకాష్ నారాయణ తెలిపారు. డైకిన్ కంపెనీ ప్రతినిధులు కృష్ణవేణి, గురుబాలాజీ, శివ పాల్గొన్నారు.

మెగా సర్వే భాగస్వాములకు ధన్యవాదాలు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

- ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

నారాయణవనం: వైఎస్సార్‌సీపీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్నే మా భవిష్యత్తు మా నమ్మకం నువ్వే జగన్ మెగా స్వర్వేలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ధన్యవాదాలు తెలిపారు. ఆదివారం సాయంత్రం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని బాధ్యతతో పూర్తి చేశామని అన్నారు. జగనన్న పాలనపై సేకరించిన అభిప్రాయాల రసీదు పుస్తకాలను పార్టీ కేంద్ర కార్యాలయానికి చేరుస్తామని తెలిపారు. సత్యవేడు నియోజకవర్గంలోని ఏడు మండలాల పార్టీ కన్వీనర్లు, జేసీఎస్ కన్వీనర్లు తమ పరిధిలోని సచివాలయ కన్వీనర్ల నుంచి రసీదులను సేకరించి, ఆదివారం ఉదయం 10 గంటలకు నారాయణవనంలోని హరి ఫంక్షన్ హాల్ వద్ద చేర్చాలని అన్నారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు గడప గడపకు వెళ్లి అభిప్రాయాలతో కూడిన పూర్తి సమాచారాన్ని కంప్యూటరీకరణ చేయించడానికి కేంద్ర కార్యాలయానికి అందజేయాల్సి ఉందన్నారు. పార్టీ అధిష్టానం సూచన మేరకు పుస్తకాలను చేర్చాల్సి ఉందన్నారు. ఈ సందర్భంగా నారాయణవనం మండల జేసీఎస్ కన్వీనర్లు కోనేటి బాబు, ఎంపీపీ దివాకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ శివశంకర్, పార్టీ నాయకులు సొరకాయలు, మోహన్ రసీదు పుస్తకాలను ఎమ్మెల్యేకు అందజేశారు.

మృతదేహం అప్పగింత

ఏర్పేడు: మండలంలోని కొత్తకండ్రిగ సమీపంలో ఉన్న పుష్పిత్ కర్మాగారం వద్ద శనివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో స్కూటరిస్ట్ మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ మేరకు మృతదేహాన్ని వారి బంధువులకు అప్పగించినట్లు ఏర్పేడు సీఐ శ్రీహరి ఆదివారం తెలిపారు. సీఐ వివరాల మేరకు.. మండలంలోని మాధవమాలకు చెందిన రాఘవేంద్ర(53) శనివారం అర్ధరాత్రి శ్రీకాళహస్తి నుంచి తిరుపతికి ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వెళుతూ పుష్పత్ కర్మాగారం వద్ద ఆగిఉన్న లారీని ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో రాఘవేంద్ర అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఆదివారం పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్లు సీఐ చెప్పారు.

అన్నమయ్య గొప్ప సామాజిక వేత్త


శ్వేత మాజీ డైరెక్టర్ భూమన సుబ్రమణ్యంరెడ్డి

తిరుపతి కల్చరల్: భగవంతుని దృష్టిలో మనుషులందరూ సమానమేనని తన సంకీర్తనల ద్వారా చాటి చెప్పిన తాళ్లపాక అన్నమయ్య గొప్ప సామాజిక వేత్త అని శ్వేత మాజీ డైరెక్టర్ భూమన సుబ్రమణ్యం రెడ్డి తెలిపారు. అన్నమాచార్య కళామందిరంలో జరుగుతున్న అన్నమయ్య 615వ జయంతి ఉత్సవాలు ఆదివారంతో రెండవ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా నిర్వహించిన సాహితీ సదస్సుకు అధ్యక్షత వహించిన భూమన్ అన్నమయ్య– సామాజికత అనే అంశంపై ఉపన్యసించారు. ఆయన పలు సంకీర్తనల్లో ఆనాటి గ్రామీణ పరిస్థితులు, పాడి పంటలు, సాగునీరు, కుటుంబ సంబంధాలు వంటి అంశాలను తెలియజేశారని తెలిపారు. తాను శ్వేత డైరెక్టర్‌గా పని చేసిన కాలంలో అన్నమయ్య స్ఫూర్తితోనే శ్వేతలో గిరిజన, దళిత, మత్స్యకార తదితర వర్గాల వారికి అర్చక శిక్షణ ప్రారంభించామని గుర్తు చేశారు. బెంగళూరుకు చెందిన ఆచార్య జీఎస్.మోహన్ అన్నమయ్య –పురందరదాసులు అనే అంశంపై ఉపన్యసించారు. ఇద్దరి సంకీర్తనలు జానపద శైలిలో , సామాన్యప్రజలకు అర్థమయ్యేలా ఉంటాయన్నారు. విజయవాడకు చెందిన డాక్టర్ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ అన్నమయ్య –దివ్య ప్రబంధములు అనే అంశంపై ఉపన్యసించారు. సాయంత్రం తిరుపతికి చెందిన జి.నాగేశ్వర నాయుడు బృందం నిర్వహించిన సంగీత కచేరి, తిరుపతికి చెందిన జ్యోత్స్న బృందం హరికథాగానం భక్తులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకుడు ఆకెళ్ల విభీషణ శర్మ, తుడా కార్యదర్శి లక్ష్మి పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో పూర్వపు ఈఓ


ఆలయం వెలుపల రామారావు కుటుంబం

రేణిగుంట: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని ఆలయ పూర్వపు ఈఓ రామారావు ఆదివారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ దక్షిణ గోపురం వద్ద ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేద పండితులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ అధికారులు నాగభూషణం నాయక్, వెంకటస్వామి తదితరులు ఉన్నారు.

ఉద్యాన రైతులు జాగ్రత్తలు పాటించాలి

వరదయ్యపాళెం: మండలంలో కురుస్తున్న అకాల వర్షాలకు ఉద్యాన పంటలు సాగు చేస్తున్న రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని సత్యవేడు ఉద్యానశాఖ అధికారిణి రాధారాణి సూచించారు. వర్షాల ప్రభావంతో కూరగాయల పంటల్లో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. ''పొలంలో నిలిచిన నీటిని సాధ్యమైనంత త్వరగా బయటకు పంపాలి. ప్రధానంగా మిరప తోటల్లో వాలిపోయిన మొక్కలను జాగ్రత్తగా నిలబెట్టి మొక్క మొదులు చుట్టూ మట్టిని నింపాలి. వర్షాలు ఆగిన వెంటనే అంతర సేద్యం చేసి కలుపును తొలగించి నేల త్వరగా ఆరేటట్టు చర్యలు తీసుకోవాలి. అలాగే 999, 1345 ఎరువులను అవసరాన్ని బట్టి చల్లాలి. చీడపీడల నివారణకు కూరగాయల పంటల్లో క్లోరిఫైరిపాస్ 2మి.లీ, డయోడికార్బ్ ఒక గ్రాము నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలి. తీవ్రంగా నష్టపోయిన రైతులు ఆయా గ్రామాల పరిధిలోని రైతు భరోసా కేంద్రాల్లో గ్రామ వ్యవసాయ ఉద్యాన సహాయకులను సంప్రదించి వివరాలను తెలపాలని'' కోరారు.


మరదవాడలో వరినాట్లు వేస్తున్న రైతులు

జోరుగా వరినాట్లు


అంజూరులో వరినాట్లకు సిద్ధం చేసిన పొలాలు

వరదయ్యపాళెం: ఈ ఏడాది ఎండా కాలంలోనూ వర్షాలు పడుతుండడంతో మండల వ్యాప్తంగా వరినాట్లకు రైతులు సిద్ధమయ్యారు. మండలంలోని సీఎల్ఎన్‌పల్లి, మరదవాడ, అంబూరు, మావిళ్లపాడు, కళత్తూరు, చెన్నవారిపాళెం, యానాదివెట్టు, కదూరు, చిలమత్తూరు ప్రాంతాల్లో వరినాట్లు వేస్తున్నారు. అడుసు దున్నకాలు, పొలం పనుల్లో రైతులు బిజీగా ఉన్నారు. గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో వాతావరణం చల్లబడడమే కాకుండా ఎండకారు పంటలకు ఎంతో అనుకూలమని రైతులు చెబుతున్నారు.

బైక్‌ను ఢీకొన్న లారీ.. ఇద్దరికి గాయాలు

పెళ్లకూరు: నాయుడుపేట–పూతలపట్టు జాతీయ రహదారి మార్గంలో గుర్రప్పతోట గ్రామం వద్ద ఆదివారం రాత్రి ఎదురుగా వస్తున్న మోటారు బైక్‌ను లారీ ఢీకొంది. ఈ ఘటనలో ప్రభాస్ అనే యువకుడికి తీవ్ర గాయాలు కాగా, మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. నాయుడుపేట నుంచి ప్రభాస్ అనే వ్యక్తి తన స్నేహితుడితో కలసి తిరుపతికి బైక్‌లో వెళుతున్నాడు. మార్గ మధ్యంలో గుర్రప్పతోట గ్రామం వద్ద తిరుపతి నుంచి నెల్లూరుకు వెళుతున్న లారీ ఢీకొంది. ఈ ఘటనలో ప్రభాస్‌కు తీవ్ర గాయాలు కాగా, అతడి స్నేహితుడికి స్వల్ప గాయాలయ్యాయి. దీంతో ప్రభాస్‌ను స్థానికులు 108వాహనంలో నాయుడుపేటకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అకాల వర్షం.. రైతన్నకు నష్టం


నేలరాలిన మామిడి కాయలు


వర్షంలో తడిచిన మిరప కాయలను ఆరబెడుతున్న రైతులు

- మామిడి, మిరప పంటలు వర్షార్పణం
- ఈదురు గాలులు, వడగండ్ల వానకు నేలరాలిన కాయలు
- వర్షానికి తడిచి రంగు మారిన మిరపకాయలు

బుచ్చినాయుడుకండ్రిగ: మామిడి, మిరప రైతులను అకాల వర్షం దెబ్బతీసింది. మండలంలోని గాజులపెళ్లూరు, కనమనంబేడు, కాటూరు, వెస్టువరత్తూరు, గ్రామాల్లో 250 ఎకరాల్లో మామిడి తోటలున్నాయి. బుచ్చినాయుడుకండ్రిగ, జీఎన్‌కండ్రిగ, ఆర్‌అనంతాపురం, వీఎస్‌పురం గ్రామాల్లో 200 ఎకరాల్లో మిరప పంటను సాగు చేస్తున్నారు. భారీ ఈదురు గాలులు, అకాల వర్షంతో కోతకొచ్చే దశలో ఉన్న మామిడి, మిరప దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపింది. మామిడి కాయలతోపాటు పిందెలు నేలరాలాయి. చేతికొచ్చే పంట దెబ్బతినడంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఈదురు గాలులకు మిరపచెట్లు నేలమట్టం అయ్యాయి. కాయలు దెబ్బతిని రంగు మారిపోయాయి. రేయింబవళ్లు చెమటోడ్చి కాపాడుకున్న పంట మొత్తం నేలపాలు కావడంతో రైతులు కన్నీటి పర్యంతం అవుతున్నారు.

పత్తాలేని ఉద్యానశాఖ సిబ్బంది

అకాల వర్షంతో దెబ్బతిన్న పంటలను పరిశీలించి, పంట నష్టాన్ని ప్రభుత్వానికి నివేదించాల్సిన ఉద్యానవనశాఖ సిబ్బంది పత్తాలేరని రైతులు చెబుతున్నారు. పంట నష్టం గురించి ఎవరికి చెప్పాలో తెలియడం లేదని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉద్యానశాఖ సిబ్బంది దెబ్బతిన్న పంటలను పరిశీలించి ఆదుకోవాలని కోరుతున్నారు.

చేతికొచ్చిన పంట నేల పాలైంది

చెట్లకు కాయలు బాగానే కాశాయి. ఈసారి మంచి దిగుబడి వస్తుందని ఆశపడ్డాం. అందుకు తగ్గట్టుగానే మామిడికి మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. అయితే వానదెబ్బకు ఆశలు తలకిందులయ్యాయి. భీకరమైన గాలులు, వానకు పిందెలు, కోత దశలోని కాయలన్నీ నేల రాలాయి.

–శ్రీనివాసులురెడ్డి, మామిడిరైతు

ఆశలన్నీ ఆవిరయ్యాయి

మిరప రైతులు ఆశలు గల్లంతయ్యాయి. ఈదురు గాలులకు మిరప చెట్లు నెలమట్టం అయ్యాయి. కోతదశలో ఉన్న మిరప కాయలు, పండ్లు నీటిలో తడిచి కుళ్లిపోయాయి. రంగు మారిపోయాయి. చెట్లు చనిపోతున్నాయి. నెలరాలిన కాయలన్నీ నీటిలో కొట్టుకుపోయాయి. వర్షం అపార నష్టాన్ని మిగిల్చింది.

–యువరాజ్, మిరప రైతు

భక్తులకు నాణ్యమైన అన్నప్రసాదం


అన్నప్రసాదం నాణ్యతను అడిగి తెలుసుకుంటున్న ఆలయ చైర్మన్ అంజూరు

రేణిగుంట: శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో భక్తులకు నాణ్యమైన అన్నప్రసాదం అందించాలని శ్రీకాళహస్తి దేవస్థానం చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు సిబ్బందికి సూచించారు. ఆదివారం మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలోని నిత్యాన్నదాన సత్రాన్ని ఆయన పరిశీలించారు. అన్నదానానికి వినియోగించే సరుకులు, కూరగాయలు పరిశీలించి అక్కడి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అన్నప్రసాదం తయారీలో నాణ్యత ప్రమాణాలు ఏ మాత్రం తగ్గకుండా భక్తులకు రుచికరమైన భోజనం అందించాలన్నారు. భక్తులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. అనంతరం భక్తులతో మాట్లాడి సమస్యలేమైనా ఉన్నాయా..? అని అడిగి తెలుసుకున్నారు. దాతలు అన్నదాన పథకానికి విరాళాలు విరివిగా అందజేయాలని కోరారు. జన్మదినాలు, ఇతర ముఖ్య పర్వదినాలను పురస్కరించుకుని దాతలు విరాళాలందించాలని కోరారు. ప్రతి రోజు మధ్యాహ్నం 7 వేల మందికి, రాత్రి 2,500 మందికి అన్నదాన ప్రసాదాలు అందజేస్తున్నట్లు తెలిపారు.

ధర్మ, భక్తి, జ్ఞానమార్గాలు మోక్షానికి దిక్సూచికలు


రామకృష్ణ మిషన్ వార్షిక వేడుకలను ప్రారంభిస్తున్న అతిథులు, ఆశ్రమ ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: ధర్మ, భక్తి, జ్ఞాన మార్గాలు మోక్షానికి దిక్సూచికలని, వాటిని ఆచరించి మానవాళి తమ జీవితాలను సార్థకం చేసుకోవాలని శ్రీవేంకటేశ్వర వేద వర్సిటీ ఉపకులపతి రాణిసదా శివమూర్తి తెలిపారు. రామకృష్ణ మిషన్ ఆశ్రమం ఆవరణలో శనివారం శ్రీరామకృష్ణ మిషన్ 125వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి మనిషిలోనూ భగవంతుడిని చూసి సేవ చేయాలన్నారు. మానవాళికి సేవ చేసేందుకు ప్రతి నాగరిక దేశంలో ఆశ్రమాన్ని ప్రారంభించాలని రామకృష్ణ మిషన్ అధికారులను కోరారు. కడప రామకృష్ణ మిషన్ అధ్యక్షుడు స్వామి భీతి హరానందజీ మాట్లాడుతూ ప్రతి వ్యక్తీ సేవ చేయడాన్ని అలవర్చుకోవాలని కోరారు. రామకృష్ణ మిషన్ అభివృద్ధిలో శ్రీ శారదా మాత పాత్రపై జి.శ్రీదేవి ఉపన్యసించారు. డాక్టర్ పీసీ రెడ్డి మాట్లాడుతూ భగవాన్ రామకృష్ణ ఆధ్యాత్మికతను, ఆధ్యాత్మిక యాత్రను, ఆయన సేవను మహాత్మా గాంధీ కొనియాడిన విధానాన్ని తెలియజేశారు.